

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 6 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 272 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY NOVEMBER 6 2026 | VOL:18 | ISSUE: 272 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్.. రేపటి నుంచి మూడ్రోజుల పర్యటన

సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు

సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు

పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు



తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు.

(మిగతా 2వ పేజీలో..)

బాలరాజు యాదవ్ అరెస్ట్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

బీఆర్ఎస్ నేత దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్ట్

అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

రాజకీయ కక్ష సాధింపేనంటూ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు పోలీసు కేసులతో బదులివ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని హెచ్చరించారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్, హరీశ్ రావులపై బల్మూర్ వెంకట్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అట్రాసిటీ కేసు పెట్టడం రాజకీయ



(మిగతా 2వ పేజీలో..)

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు



తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన

గుంటూరు జిల్లా రేటూరులో రైతులతో మాట్లాడిన సీఎం

నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్ఘాటన

మంచి దిగుబడితో పంట చేతికొచ్చి ఆనందంగా ఉన్న సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను తుపాను దెబ్బతీయడం అత్యంత బాధాకరమని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి

(మిగతా 2వ పేజీలో..)

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు.. 4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచిన కాంగ్రెస్

1, 21, 25, 33వ వార్డులను కైవసం చేసుకున్న హస్తం పార్టీ

పురపాలికలో అధిక్యంలో కొనసాగుతున్న టీడీపీ

గెలిచిన అభ్యర్థులకు ఏపీ కాంగ్రెస్ కమిటీ శుభాకాంక్షలు



ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఫలితాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీ కూటమి హవా కొనసాగినప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ పార్టీ

(మిగతా 2వ పేజీలో..)

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'.. త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మంది పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

యాప్ ద్వారా ఆరోగ్య వివరాల నమోదు.. రిస్క్ ఆధారంగా వర్గీకరణ

ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా వైద్య సాయం, కౌన్సెలింగ్ ఏర్పాటు

వ్యాధులు ముదరక ముందే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యం

తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు.హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు.సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లోకి లాగిన్ కావచ్చు. వారు అందించిన

(మిగతా 2వ పేజీలో..)



60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే: రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్

కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు

పరిస్థితిని 'రేవంత్ వృష్టి'గా అభివర్ణన

దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ

పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్‌పై ధ్వజం



రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే

(మిగతా 2వ పేజీలో..)

మోదీతో సూర్యకుమార్ యాదవ్ భేటీ.. 'రామ్, సరయూ' అంటూ ప్రధాని ట్వీట్

కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలిసిన భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్

ప్రపంచకప్ బంగారు పతకాన్ని పరిశీలించి, సూర్యకుమార్‌ను అభినందించిన ప్రధాని

సూర్యకుమార్ పిల్లలను 'రామ్, సరయూ'గా అభివర్ణిస్తూ మోదీ చేసిన ట్వీట్ వైరల్



భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యాడు. ఈ భేటీకి సూర్య తన కుటుంబంతో సహా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. సూర్యకుమార్ పిల్లలతో ఆప్యాయంగా గడిపారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సూర్యకుమార్ పిల్లల పేర్లను ప్రస్తావిస్తూ, దీపావళి పండుగ వాతావరణంలో రామ్, సరయూల రాకతో పండుగ వాతావరణం మరింత పవిత్రంగా, దివ్యంగా మారిందని పేర్కొన్నారు.ఈ భేటీలో ఈ ఏడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రక విజయంలో

(మిగతా 2వ పేజీలో..)

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!

సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!

కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన

కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక



సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

ప్రజా ప్రదేశాల పరిరక్షణ.. సమాజానికి సమష్టి బాధ్యత!

ఒక పట్టణం లేదా గ్రామం అభివృద్ధి చెందిందంటే అక్కడి రహదారులు, భవనాలు, వాణిజ్య సముదాయాలు మాత్రమే కాదు.. ప్రజలకు అందుబాటులో ఉన్న పార్కులు, ఆటస్థలాలు, గ్రంథాలయాలు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాలు కూడా అభివృద్ధి చెందాలి. ప్రజలు స్వేచ్ఛగా నడవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, పిల్లలు ఆటలాడుకోవడానికి, వృద్ధులు ప్రశాంతంగా గడపడానికి అవసరమైన ప్రదేశాలు ప్రతి ప్రాంతంలో ఉండాలి. కానీ పెరుగుతున్న జనాభా, నిర్మాణాల విస్తరణ, ఆక్రమణలు, నిర్వహణ లోపాల కారణంగా ప్రజా ప్రదేశాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

పట్టణాల్లో ఫుట్‌పాత్‌లు, పార్కులు, ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. పాదచారులు నడవాల్సిన మార్గాల్లో దుకాణాలు, వాహనాల పార్కింగ్, ఇతర నిర్మాణాలు ఏర్పడటంతో ప్రజలు రహదారులపై నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ఇతర ప్రయోజనాలకు వినియోగించకుండా అధికారులు పర్యవేక్షించాలి. ఆక్రమణలు జరిగినప్పుడు రాజకీయ లేదా వ్యక్తిగత ప్రభావాలకు తావులేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజా స్థలాలను కాపాడటం అంటే భవిష్యత్తు తరాల అవసరాలను కాపాడటమే.

పార్కులు ఆరోగ్యానికి వేదికలు

రోజురోజుకూ పెరుగుతున్న పని ఒత్తిడి, వాహనాల రద్దీ, కాలుష్యం మధ్య ప్రజలకు ప్రశాంతంగా గడిపే ప్రదేశాలు అవసరం. పార్కులు, బహిరంగ ప్రాంగణాలు అందుకు ఎంతో ఉపయోగపడతాయి. ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు, వ్యాయామం చేసేవారు, పిల్లలతో సమయం గడిపే కుటుంబాలకు ఇవి ఎంతో అవసరం.అయితే అనేక ప్రాంతాల్లో పార్కులు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. మొక్కలకు నీరు అందించకపోవడం, వ్యాయామ పరికరాలు దెబ్బతినడం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్థానిక సంస్థలు పార్కుల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వాటిని పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచాలి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయవచ్చు.

పిల్లలకు ఆటస్థలాలు కల్పించాలి

ప్రస్తుత కాలంలో పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడుపుతున్నారు. బహిరంగ ఆటలకు అవకాశం తగ్గిపోవడం వల్ల శారీరక చలనం కూడా తగ్గుతోంది. ప్రతి కాలనీ, గ్రామంలో పిల్లలు సురక్షితంగా ఆడుకునే మైదానాలు ఉండాలి.క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలకు అవసరమైన స్థలాలను పరిరక్షించాలి. ఇప్పటికే ఉన్న ఆటస్థలాలను ఇతర అవసరాలకు మళ్లించకుండా చూడాలి. పాఠశాలలతో పాటు స్థానిక సంస్థలు కూడా క్రీడా వేదికలను అభివృద్ధి చేయాలి. చిన్న వయసు నుంచే క్రీడల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తే పిల్లల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే లక్షణాలు పెరుగుతాయి.

పాదచారుల హక్కులను గుర్తించాలి

రోడ్లు వాహనాల కోసమే అన్న ఆలోచన మారాలి. పాదచారులు, సైకిల్ ప్రయాణికులు కూడా రహదారులపై సమాన హక్కు కలిగి ఉంటారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురైతే ప్రజలు వాహనాల మధ్య నడవాల్సి వస్తుంది. ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది.రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ల సమీపంలో సురక్షితమైన ఫుట్‌పాత్‌లు, జీబ్రా క్రాసింగ్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. దివ్యాంగులు సులభంగా ప్రయాణించేందుకు అనువైన మార్గాలు ఉండాలి. పట్టణ ప్రణాళికలో పాదచారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రంథాలయాలు, సామాజిక వేదికలను బలోపేతం చేయాలి

ప్రజా ప్రదేశాలు అంటే పార్కులు, ఆటస్థలాలు మాత్రమే కాదు. గ్రంథాలయాలు, కమ్యూనిటీ కేంద్రాలు, సాంస్కృతిక వేదికలు కూడా సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. యువత చదువుకునేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, వృద్ధులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇలాంటి వేదికలు అవసరం.ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను ఆధునికీకరించాలి. పుస్తకాలు, పత్రికలు, డిజిటల్ సమాచారం, చదువుకునే సదుపాయాలు కల్పించాలి. స్థానిక కళాకారులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు కార్యక్రమాలు నిర్వహించేందుకు బహిరంగ వేదికలు అందుబాటులో ఉండాలి. ప్రజల మధ్య అనుబంధాలను పెంచడంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

ప్రభుత్వం నిర్మించిన పార్కు, మైదానం లేదా గ్రంథాలయాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకోకపోతే దాని ప్రయోజనం తగ్గిపోతుంది. ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయడం, గోడలు పాడుచేయడం, మొక్కలను ధ్వంసం చేయడం, పరికరాలను దుర్వినియోగం చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి.స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలి. పార్కుల పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, ఆటస్థలాల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలి. ప్రజా ఆస్తి అంటే ఎవరిదో కాదు.. అందరిదనే భావన పెరిగినప్పుడే వాటి పరిరక్షణ సాధ్యమవుతుంది.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వారికి వివరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎల్ నినో ప్రభావంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంటే, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాం. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని సీఎం స్పష్టం చేశారు. "తుపానులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ముందస్తు జాగ్రత్తల వల్లే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం" అని విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాయం తీసుకుంటున్నామని వివరించారు. అర్నబ్ తుపాను వల్ల నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాను వల్ల దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నామని, దీనిపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపానుల ప్రభావంపై ఆరా తీశారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడిని తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. "గత పాలనలో తుపానులు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి పరామర్శించారు. కానీ మేము ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడతా" అని అన్నారు. తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమను ఎల్ నినో ఇబ్బంది పెడుతోందని, అందుకే రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వివరించారు.

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్.. రేపటి నుంచి మూడ్రోజుల పర్యటన

మొదటి పేజీ తరువాయి)

మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.

పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు.

రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల (ఎస+) మహిళలతో సమావేశమవుతారు.

ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఎనజ) భవనాలను ప్రారంభిస్తారు.

బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు.

నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు.

రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

బాలరాజు యాదవ్ అరెస్ట్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.ఈ అరెస్టుపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను నిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు" అని కేటీఆర్ పేర్కొన్నారు.బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కాలరాయలేరని హితవు పలికారు. ఈ అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా ఖండించారు.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే: రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు.గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!

మొదటి పేజీ తరువాయి)

ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

మోదీతో సూర్యకుమార్ యాదవ్ భేటీ.. 'రామ్, సరయూ' అంటూ ప్రధాని ట్వీట్

మొదటి పేజీ తరువాయి)

భాగంగా గెలుచుకున్న బంగారు పతకంతో సూర్యకుమార్ కనిపించాడు. ప్రధాని మోదీ ఆ పతకాన్ని చేతిలోకి తీసుకుని పరిశీలించి, సూర్యకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ దృశ్యం టీమిండియా చారిత్రక విజయాన్ని గుర్తుచేసింది.టీ20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. 2022, 2023 సంవత్సరాల్లో వరుసగా 'ఐసీసీ మెన్స్ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును గెలుచుకున్నాడు. 2022 అక్టోబర్‌లో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకున్న సూర్యకుమార్, 2023 జనవరిలో 910 పాయింట్లతో కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్‌ను సాధించాడు.సూర్యకుమార్ నాయకత్వంలోనే భారత్ 2025 టీ20 ఆసియా కప్, 2026 టీ20 ప్రపంచకప్‌లను కైవసం చేసుకుంది. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, ఇంతటి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే అతనిపై వేటు పడటం గమనార్హం. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న యూకే పర్యటనకు ప్రకటించిన టీ20 జట్టులో సూర్యకుమార్‌కు చోటు దక్కలేదు. ఇటీవల కాలంలో సూర్య బ్యాటింగ్ ఫామ్ కాస్త తగ్గడమే ఇందుకు కారణమని సమాచారం. అతని స్థానంలో ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్‌ను బీసీసీఐ కొత్త టీ20 కెప్టెన్‌గా నియమించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధానితో సూర్యకుమార్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'.. త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

మొదటి పేజీ తరువాయి)

సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు.ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవి తీవ్రం కాకముందే వైద్య సహాయం అందించడం 'ఫిట్ కాప్' ప్రాథమిక లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో ఆరోగ్య స్పృహను పెంచి, నివారణ చర్యలను ప్రోత్సహించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు, విభాగాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. 'ఫిట్ కాప్' సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటానికి ఒక ముఖ్యమైన వ్యవస్థాగత యంత్రాంగంగా ఎదుగుతుందని డీజీపీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు.. 4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

అనూహ్యంగా పుంజుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఏకంగా నాలుగు వార్డులను కైవసం చేసుకుని దశాబ్ద కాలం తర్వాత తన ఉనికిని చాటుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న జరిగింది. అయితే మురసు తుపాను ప్రభావంతో చీరాలలో కౌంటింగ్ నవంబరు 6కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో, నేటి ఓట్ల లెక్కింపులో ఆశ్చర్యకర ఫలితాలు వెలువడ్డాయి.ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం టీడీపీ 12 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 4, వైఎస్సార్సీపీ 2 వార్డులను గెలుచుకున్నాయి. చీరాలలో కాంగ్రెస్ ఈ స్థాయిలో విజయం సాధించడం వెనుక మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌లో చేరిన ఆమంచి కృష్ణమోహన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా, విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 1, 21, 25, 33వ వార్డులలో విజయం సాధించారు. ముఖ్యంగా 25వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు.. బీజేపీ, వైసీపీ అభ్యర్థులను వెనక్కి నెట్టడం గమనార్హం. రాష్ట్రంలో ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఫలితాలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) హర్షం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా వేదికగా విజేతలకు శుభాకాంక్షలు తెలిపింది. "ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజాసేవలో ముందుండి, వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి" అని ఆకాంక్షించింది. పూర్తిస్థాయి ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉన్నప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
నవంబర్ । శనివారం । 7 । 2026

మహిళపై లైంగిక దాడికి యత్నం.. ఆత్మహత్యకు ప్రేరేపణ

నిందితుడికి 31 ఏళ్ల కఠిన కారాగార శిక్ష.. రూ.20 వేల జరిమానా

నల్లగొండ, నవంబర్ 6 (విజయ కెరటం):

మహిళపై లైంగిక దాడికి యత్నించడం, అక్రమంగా నిర్బంధించడం, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి నేరాలకు పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 31 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ వెల్లడించారు.నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరి.చీ.శీ.270/2021, SC.No.141/2021గా నమోదైన కేసులో వజ్జ శ్రీను అలియాస్ కార్తీక్ (31) నిందితుడిగా ఉన్నాడు. అనంతరం గ్రామానికి చెందిన ఇతను ప్రస్తుతం నల్లగొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీలో నివాసం ఉంటున్నాడు.ఈ కేసుపై నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం కమ్ ×× అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి నవంబర్ 6న తీర్పు వెలువరించారు. ఐపీసీ సెక్షన్ 306 కింద 10 సంవత్సరాలు, సెక్షన్ 376 రెడ్‌విత్ 511 కింద 10 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ 3(2)(ఙ)(ఝ) కింద 10 సంవత్సరాలు, ఐపీసీ సెక్షన్ 342 కింద ఒక సంవత్సరం చొప్పున శిక్ష విధించారు. ప్రతి సెక్షన్ కింద రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల జరిమానా విధించారు. అన్ని శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలపై నేరాలకు పాల్పడే వారిపట్ల పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. నాణ్యమైన దర్యాప్తు, పకడ్బందీ సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు విచారణలో సమన్వయంతో నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అధికారులు గుత్తా వెంకట్ రెడ్డి, జి. వెంకటేశ్వర్ రెడ్డితో పాటు ప్రస్తుత ఎస్‌డీపీఓ కె. శివరాం రెడ్డి, సీఐ కె. ఆదిరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎస్. శోభారాణి, ఆర్. అఖిల, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బి. వెంకటేశ్వర్లు, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కేసు నమోదు నుంచి తుది తీర్పు వరకు సమన్వయంతో కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను ప్రశంసిస్తూ, ఇదే స్ఫూర్తితో బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.



వృద్ధురాలి హత్య కేసులో నిందితురాలికి డబుల్ జీవిత ఖైదు

- **రూ.20 వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు**

నల్లగొండ, నవంబర్ 6 (విజయ కెరటం):

వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన కేసులో ప్రధాన నిందితురాలికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక సెషన్స్ కోర్టు రెండు జీవిత ఖైదులతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ మేరకు కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ వెల్లడించారు.కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోర్లపహాడ్ గ్రామం రెగులగడ్డలో 2019 జూలై 1వ తేదీ తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. బెల్ట్ షాప్ నిర్వహణకు సంబంధించిన పాత కక్షలు, మనస్పర్థల నేపథ్యంలో పథకం ప్రకారం ఇంట్లోకి చొరబడిన నిందితులు, ఇంట్లో నిద్రిస్తున్న సయ్యద్ ఆశాబీ (74)పై గొడ్డలితో దాడి చేసి, కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఈ ఘటనపై మృతురాలి బంధువు సయ్యద్ జాకీర్ ఫిర్యాదు మేరకు కేతేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో ముషం అంతమ్మ (54), చింతల శ్రీను (34), విప్పు ధనలక్ష్మి అలియాస్ ధనమ్మ (34)లను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణలో ఏ-1 ముషం అంతమ్మపై హత్య నేరం కింద ఐపీసీ 302 సెక్షన్ ప్రకారం ఒక జీవిత ఖైదు, నేరపూరిత కుట్రకు సంబంధించి 120(దీ) సెక్షన్ కింద మరో జీవిత ఖైదు విధించింది. వీటితో పాటు సెక్షన్ 452 కింద ఏడేళ్లు, సెక్షన్ 201 కింద మరో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొత్తం రూ.20 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొంది.కాగా, ఈ కేసులో ఏ-2 చింతల శ్రీను మరణించగా, ఏ-3 విప్పు ధనలక్ష్మి అలియాస్ ధనమ్మపై నమోదైన అన్ని అభియోగాల నుంచి కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది.ఈ కేసు దర్యాప్తులో అప్పటి కేతేపల్లి ఎస్ఐ బి. రామకృష్ణ, షాలిగౌరారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కె. కాస్ట్రో, పి.ఎన్.డి. ప్రసాద్ కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వ తరపున ప్రత్యేక కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. శోభారాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల వాదనలు వినిపించారు. కోర్టు ప్రక్రియల పర్యవేక్షణలో ప్రస్తుత కేతేపల్లి ఎస్సైచ్ఓ ఎస్. సతీష్, సీఐ పి. రాజశేఖర్, ఎస్‌డీపీఓ కె. శివరాం రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్‌తో పాటు కోర్టు డ్యూటీ, లైజన్ అధికారులు సహకరించారు.నిందితురాలికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టులో కేసు బలంగా నిలబెట్టిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ, లైజన్ అధికారులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.



నవంబర్ 15న రైతు మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలి





- **వేలాదిగా తరలిరావాలి.. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపు**

నల్గొండ, నవంబర్ 6 (విజయ కెరటం):

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 15న నల్గొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం నల్గొండ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో ఇతర దేశాల వ్యవసాయ ఉత్పత్తులను సుంకాలు లేకుండా దిగుమతి చేసుకునేందుకు అవకాశం కల్పించడం వల్ల దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఈ నేపథ్యంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న జరిగే బహిరంగ సభకు ముందు రెడ్ షర్ట్, రెడ్ శారీ కవాతు నిర్వహిస్తామని, కోలాట బృందాలు, డప్పుల దళాలు, విచిత్ర వేషధారణలతో మర్రిగూడ బైపాస్ నుంచి ఎన్జీ కాలేజీ వరకు భారీ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. నల్గొండ నియోజకవర్గం నుంచి వేలాదిమంది పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.మహాసభల సందర్భంగా నవంబర్ 14 నుంచి 16 వరకు పెద్ద గడియారం సెంటర్‌లోని పాత ఆర్‌అండ్‌బీ ఐబీ స్థలంలో ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు, వంగడాలు, వ్యవసాయ పరికరాలతో అగ్రిషో నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హషం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య, కొండా అనురాధ, మండల కార్యదర్శులు నలపరాజు సైదులు, మన్నెం బిక్షం, పుల్లెంల శ్రీకర్, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, పోలే సత్యనారాయణ, భీమగాని గణేష్, బ్రహ్మానందరెడ్డి, దేవిరెడ్డి అశోక్ రెడ్డి, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో పంటల మార్పిడికి ప్రాధాన్యం

- **తక్కువ నీటితో అధిక లాభాల పంటలు సాగు చేయాలి**
- **ప్రొఫెసర్ జలపతిరావు**

వరంగల్, నవంబర్ 06 (విజయ కెరటం):



వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు యాసంగి సీజన్‌లో పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జలపతిరావు సూచించారు.తక్కువ నీరు, పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు ఇచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు.నగరంలోని అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటి ప్రభావం వ్యవసాయ రంగంపై పడుతోందన్నారు. జనుము, మినుములు, తెల్ల నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని, భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.తెలంగాణ రైతు సంఘం గౌరవ అధ్యక్షులు, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారుల ప్రమేయం లేకుండా రైతులే సహకార సంఘాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. నాబార్డ్ వంటి సంస్థల సహకారం పొందాలని అన్నారు.కార్యక్రమానికి సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, రాచర్ల బాలరాజు, ఓదెల రాజయ్య, సోమ రామ్మూర్తి, షేక్ హుస్సేన్, బుగ్గే శేఖర్, హంసల్ రెడ్డి, ఆర్. దామోదర్ రెడ్డి, ముగిడే వీరయ్య, మోహన్ రావు, చిర్ర రవీందర్, బి. రవీందర్, ఎన్. విజయ్ తదితరులు, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి శక్తితోనే సామాజిక ఉద్యమాలకు విజయం!

- **ప్రతి విద్యాసంస్థలో విద్యార్థి సంఘాల నిర్మాణానికి పిలుపు**

వరంగల్, నవంబర్ 06 (విజయ కెరటం):



విద్యార్థుల భాగస్వామ్యంతోనే సామాజిక ఉద్యమాలు విజయవంతమవుతాయని, సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశగా విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని మాదిగ విద్యార్థి సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బొచ్చు తిరుపతి మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం సాగించిన సుదీర్ఘ పోరాటం విజయవంతమైన నేపథ్యంలో వివక్షతలేని నూతన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు.వరంగల్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం మాదిగ విద్యార్థి సమాఖ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ సాధికారత పోరాట సమితి జిల్లా సమావేశం నిర్వహించారు. మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి చింతం సిద్ధు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాదిగ సాధికారత పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు మాదిగ, కో-ఇన్‌చార్జి కళ్లపెల్లి ప్రణయ్ దీప్ మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి కట్ల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రతి ఉద్యమ విజయం వెనుక విద్యార్థి శక్తి కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమ విజయానికి మాదిగ విద్యార్థులు కూడా కీలక పాత్ర పోషించారని అన్నారు.మహనీయుల ఆశయ సాధనకు మంద కృష్ణ మాదిగ భవిష్యత్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని, వాటిని బలోపేతం చేసేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యాసంస్థ, వసతి గృహంతో పాటు అన్ని మండలాల్లో నూతన విద్యార్థి కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించాలని సూచించారు.ఈ సమావేశంలో మాసాని గోపాల్ మాదిగ, గంగారపు మల్లన్న మాదిగ, గోలి సుధాకర్ మాదిగ, ఇనుముల పూర్ణయ్య మాదిగ, కన్నెబోయిన ప్రమోద్ మాదిగ, కోడూరి రాజు మాదిగ, ముత్యాల మల్లేష్ మాదిగ, పరికి రత్నం మాదిగ, దామెర కిషోర్ మాదిగ, బర్ల యాకయ్య మాదిగ, చాడ కర్ణాకర్ మాదిగ, చిర్ర సునీల్ మాదిగ, చిన్నపెల్లి రవి మాదిగ, సీనపెల్లి రాజు మాదిగ, అనిల్ మాదిగ, కొంగర సుదర్శన్, ఐత చంద్రమౌళి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన వీవోపను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- **అన్నపూర్ణకు మద్దతుగా వీవోపల సమ్మె**

తిప్పర్తి, నవంబర్ 6 (విజయ కెరటం):



మామిడాల గ్రామంలో వీవోపగా పనిచేస్తున్న అన్నపూర్ణను ఎలాంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించారని, వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐకేపీ వీవోపీ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రాల మంగమ్మ, మండల అధ్యక్షురాలు ఎండీ రుమాన అధికారులను డిమాండ్ చేశారు.శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయం ఎదుట మండలంలోని వీవోపీలందరూ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆరోపణలు లేకుండానే రాజకీయ ఒత్తిళ్లతో అన్నపూర్ణను విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేకుండా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న వీవోపీలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను అధికారులు తక్షణమే నిలిపివేయాలని కోరారు. అన్నపూర్ణను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని, అవసరమైతే ఈ ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల వీవోపీలు జి. సునీత, సువర్ణ, సామ్రాజ్యం, రాణి, సంధ్య, వసుమతి, జయమ్మ, లక్ష్మి, మౌనిక, హేమలత, మల్లయ్య, నాగరాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి--రాం నాయక్‌ల నిశ్చితార్థ వేడుకకు హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 6 (విజయ కెరటం):

వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె గాయత్రి, రాం నాయక్‌ల నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ కాదు!

నామినేషన్ల చివరి తేదీ వరకు ఫారం-18 సమర్పించవచ్చు

నల్లగొండ, నవంబర్ 6 (విజయ కెరటం):

వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-18 సమర్పించడానికి నవంబర్ 6 చివరి తేదీ కాదని జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఎన్నికల నామినేషన్ల చివరి తేదీ వరకు ఫారం-18 సమర్పించుకునే అవకాశం ఉందని వెల్లడించారు.ఎన్నికల సంఘం గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 6 వరకు ఫారం-18 సమర్పించేందుకు గడువు నిర్ణయించినప్పటికీ, ఓటరు నమోదు విషయంలో ఎలాంటి గందరగోళం అవసరం లేదని తెలిపారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారని, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారని వివరించారు.ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ సమయంలో, అలాగే తుది జాబితా ప్రచురించిన అనంతరం కూడా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల చివరి తేదీ వరకు ఫారం-18 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు.కాబట్టి అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తొలగించిన వీవోఏను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏల సమ్మె

తిప్పర్తి, నవంబర్ 6 (విజయ కెరటం):



తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలో వీవోఏగా పనిచేస్తున్న అన్నపూర్ణను ఎలాంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించారని, వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మంత్రాల మంగమ్మ, మండల అధ్యక్షురాలు ఎండీ రుమాన అధికారులను డిమాండ్ చేశారు.శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయం ఎదుట మండలంలోని వీవోఏలందరూ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఆరోపణలు లేకుండానే రాజకీయ ఒత్తిళ్లతో అన్నపూర్ణను విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేకుండా అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వీవోఏలను మరింత ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.అన్నపూర్ణను వెంటనే విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే మండలంలోని వీవోఏలందరూ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వీవోఏలు జి. సునీత, సువర్ణ, సామ్రాజ్యం, రాణి, సంధ్య, వసుమతి, జయమ్మ, లక్ష్మి, మౌనిక, హేమలత, మల్లయ్య, నాగరాజు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 6 (విజయ కెరటం):



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఈఈ సివిల్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు మొత్తం 179 మంది అభ్యర్థులను కేటాయించగా, తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 104 మంది హాజరయ్యారు. మరో 75 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రతిరోజూ పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల నిర్వహణలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో ఫ్లయింగ్ స్క్వాడ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శశికళ, చీఫ్ సూపరింటెండెంట్ నీలం రెడ్డి, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, టీజీపీఎస్సీ స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్, పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొంపల్లి రామన్న గౌడ్ నియామకం

హైదరాబాద్, నవంబర్ 6 (విజయ కెరటం):



తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కొంపల్లి రామన్న గౌడ్ నియమితులయ్యారు. సంఘం విస్తరణలో భాగంగా శుక్రవారం ఫిలింనగర్‌లోని కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు రామచంద్రరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సురేష్ గౌడ్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు సురిగి రమేష్ గౌడ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మోల్కపురి శ్రీకాంత్ గౌడ్, నిజాంపేట్ అధ్యక్షుడు సాయి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రామన్న గౌడ్‌కు సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గౌడ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, వారి విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు.

విజయ కెరటం కథనానికి స్పందన!

సుందరయ్య నగర్‌లో పర్యటించిన కమిషనర్ వెంకన్న

వరంగల్, నవంబర్ 06 (విజయ కెరటం):



సుందరయ్య నగర్‌లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై నగరపాలక సంస్థ కమిషనర్ టి. వెంకన్న స్పందించారు. శుక్రవారం నగరంలోని సుందరయ్య నగర్‌లో పర్యటించి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్ సుందరయ్య నగర్‌లో సీసీ రోడ్లు, మురికి కాల్వలు, డ్రైనేజీ సదుపాయాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్థానిక నివాసి బాసుల దేవానందం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై నవంబర్ 2న విజయ కెరటం దినపత్రికలో 'రోడ్లు లేవు.. డ్రైనేజీ లేదు!' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన కమిషనర్ శుక్రవారం సుందరయ్య నగర్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా నాయుడు పెట్రోల్ పంపు వెనుక సాయినగర్, ఏనుమాముల మార్కెట్ సమీపంలోని సుందరయ్య



నగర్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.తమ ప్రాంత సమస్యలను వెలుగులోకి తెచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విజయ కెరటం దినపత్రికకు స్థానిక నివాసులు కృతజ్ఞతలు తెలిపారు. పత్రిక కథనంపై స్పందించి కమిషనర్ పర్యటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఎన్జీ కళాశాలలో జిజ్ఞాస రాష్ట్రస్థాయి ప్రాజెక్టుల బహుమతుల ప్రదానం

నల్గొండ, నవంబర్ 6 (విజయ కెరటం):



నాగార్జున ప్రభుత్వ కళాశాల (అటానమస్) నల్గొండలో జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదాన కార్యక్రమం శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి నల్గొండ అడిషనల్ ఎస్పీ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులు, వారి పర్యవేక్షకులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.ఉర్దూ విభాగంలో 'ఉర్దూ సోషల్ మీడియా అండ్ ఎంప్లాయిబిలిటీ ఆపర్చునిటీస్' అనే అంశంపై నల్గొండ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించారు. బయోటెక్నాలజీ విభాగంలో 'ప్లాస్టిక్ కాలుష్య నివారణకు సుస్థిర ప్రత్యామ్నాయాలు మరియు జీవసంబంధ క్షీణిత వ్యూహాలు' అనే అంశంపై ద్వితీయ బహుమతి లభించింది. అదేవిధంగా కామర్స్ విభాగంలో 'చిన్న వ్యాపారాలపై యూపీఐ డిజిటల్ చెల్లింపుల ప్రభావం' అనే అంశంపై హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతి సాధించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు, హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ ఎస్. రామారావు, నాగార్జున ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పరంగి రవికుమార్, ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బత్తిని నాగరాజు, మహిళా డిగ్రీ కళాశాల జిజ్ఞాస కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి, సూపర్‌వైజర్లు డాక్టర్ సయ్యద్ సైఫుల్లా, డాక్టర్ పుష్పలతో పాటు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలించాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలకూరి రవి గౌడ్ డిమాండ్

నల్గొండ, నవంబర్ 06 (విజయ కెరటం):

జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన గోదాములకు తరలించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలకూరి రవి గౌడ్ డిమాండ్ చేశారు.ఇటీవల మురాసు తుఫాను కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని వర్షాల నుంచి కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండి ఎండలు వస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన సిబ్బందితో పాటు అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలని కోరారు. కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ నెల 14, 15 తేదీల నుంచి మరో తుఫాను వచ్చే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని సురక్షితంగా గోదాములకు చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని అన్నారు.బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు చేపట్టాలని పాలకూరి రవి గౌడ్ కోరారు. రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోయినట్లేనని, రైతును కాపాడుకోవడమే రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడమని ఆయన పేర్కొన్నారు.



మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదు!

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందికి రూ.10,400 జరిమానా

వరంగల్, నవంబర్ 06, విజయ్ కెరటం :



మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి. సుజాత హెచ్చరించారు.వాహనదారులు రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగే అవకాశం ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ క్రమంలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందిని శుక్రవారం వరంగల్ మూడో ప్రత్యేక రెండో తరగతి న్యాయస్థానంలో మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయస్థానం 15 మందికి కలిపి రూ.10,400 జరిమానా విధించింది. అదేవిధంగా, సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తికి రూ.300 జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

ప్రభుత్వ ఒత్తిడితో కథ మార్చారా? 'మాతృభూమి'పై సల్మాన్ ఖాన్ క్లారిటీ

తన తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' కథను ప్రభుత్వ ఒత్తిడితో మార్చారన్న ప్రచారాన్ని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఖండించారు. సెన్సార్ బోర్డు అభ్యంతరాల వల్ల సినిమా నిలిచిపోయిందన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ విషయాలపై స్పందించారు.ప్రభుత్వం చెప్పడంతో కథను తిరిగి రాశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సల్మాన్ అన్నారు. "ఇదంతా అబద్ధం. మా సినిమా సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ తిరుగుతుంది. ఇరు దేశాల వైపు ఉన్న సైనికుల జీవితాలను ఇందులో చూపించాం. ఇందులో ఎవరి పట్లా ప్రతికూలత లేదు. పరిస్థితులే ప్రతికూలంగా ఉంటాయి" అని వివరించారు.దర్శకుడు అపూర్వ లఖియా తొలుత మరో కథాంశంతో సినిమా రూపొందించారని సల్మాన్ వెల్లడించారు. ఈ చిత్రం మొదట 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో తెరకెక్కింది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ ఈ కథకు ప్రేరణగా నిలిచింది. అయితే ప్రస్తుత రూపంలో సైనికుల అనుభవాలు, వారి కుటుంబాల భావోద్వేగాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సల్మాన్ తెలిపారు. సైనికులకు దేశమే మొదటి ప్రాధాన్యమని, వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరికి సానుకూల భావాలు ఉన్నా పరిస్థితులు ఎదురైనప్పుడు దేశం కోసమే నిలబడతారని చెప్పారు. ఇరు వైపులా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించారు.ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉండగా, వాయిదా పడింది. తాజా ప్రకటన ప్రకారం డిసెంబరు 4న థియేటర్లలోకి రానుంది. సల్మాన్ ఖాన్ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్, ముఖేశ్ రిషి, అంకుర్ భాటియా, జేన్ షా, అభిలాష్ చౌదరి తదితరులు నటిస్తున్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528